## క్లుప్తంగా

### బోరు పనులు ప్రారంభం



నాగలాపురం: మండల కేంద్రంలో రెండు చోట్ల బుధవారం ఎంపీపీ నిధులతో తాగునీటి కోసం బోరు పనులు ప్రారంభించారు. ముస్లిం మైనారిటీలకు రెండు రోజుల కిందట కేటాయించిన శ్మశాన స్థలంలో, రాజీవ్‌గాంధీ నగర్‌లో సర్పంచ్ సుధ ఆధ్వర్యంలో ఎంపీపీ శ్యామ్ డ్రిల్లింగ్ ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఉదయ్‌కుమార్ రెడ్డి, ధనరాజ్, ఉదయ్, చిరంజీవి, ముత్తు, దేశప్పన్, కులశేఖర్‌రెడ్డి, లోకేష్ పాల్గొన్నారు.

### మహిళలకు ఆర్థిక భరోసా



రిజిస్ట్రేషన్ పత్రాలను అందుకుంటున్న లబ్ధిదారులు

ఏర్పేడు: ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీల ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసి పేద మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని సర్పంచ్ గంగాధరం అన్నారు. మంగళవారం మండలంలోని మేర్లపాక జగనన్న కాలనీ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి రాగానే పేదల సొంతింటి కల నెరవేర్చారని చెప్పారు. పంచాయతీ పరిధిలో 43 మంది మహిళా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ పత్రాలతో బ్యాంకుల ద్వారా రుణాలను పొందవచ్చని సూచించారు. వీఆర్వో ప్రభాకర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### బడికి వెళ్లాలంటే బురద తొక్కాల్సిందే..



నారాయణవనం: పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో దుర్గంధం, దోమల బెడదతో అవస్థలు పడుతున్నట్లు మండలం లోని కసింమిట్ట వాసులు పేర్కొంటున్నారు. వ్యర్థాలు, చెత్తతో నిండి కాలువ మురుగునీరు వీధుల్లో పారుతూ దుర్గంధాన్ని వెదజల్లుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. పాఠశాల పక్కనే మురుగు నీరు వీధిలో ప్రవహిస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. పంచాయతీ అధికారులు ఇకనైనా స్పందించాలని కోరుతున్నారు.

### బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



మిద్దెల హరికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరికి ఆలయ అధికారుల ఆహ్వాన పత్రిక అందజేశారు. మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందించారు.

### ఉత్తమ వీఎల్ఈ అవార్డు



అవార్డును అందుకుంటున్న ఎలియాజర్

వరదయ్యపాళెం: పీఎం దిశా ప్రాజెక్ట్ కింద గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన, అందుకు అవసరమైన సర్టిఫికెట్లు అందించడంలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన వరదయ్యపాళెం సీఎస్ఈ కేంద్రం వీఎల్ఈ పి. ఎలియాజర్‌కు ఉత్తమ అవార్డు లభించింది. రాష్ట్రస్థాయిలో మంగళవారం విజయవాడలో జరిగిన టెలి లా వర్క్‌షాప్, మేళా కార్యక్రమంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు.

### తాగునీటి బావికి కంచె



నాగలాపురం: మండలంలోని టీపీ కోటలో తాగు నీటి బావికి కంచె ఏర్పాటు చేశారు. బావి రోడ్డుకు పక్కన ఉండడంతో ఆప్రాంతంలో ఆకతాయిలు మద్యం సేవించి ఖాళీ బాటిళ్లను బావిలో పడేస్తున్నారు. దీంతో తాగునీరు కలుషితమవుతుంది. దీనిపై సర్పంచ్ సక్కుభాయి స్పందించారు. ఎంపీపీ శ్యామ్ సహకారంతో బావి చుట్టు కంచె ఏర్పాటు చేయించారు.




# కాంతుల కోవెల

దక్షిణకాశిగా పేరొందిన శ్రీకాళహస్తి క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అడుగడుగునా ఆధ్యాత్మికత ఉట్టిపడుతోంది. ఉదయం, రాత్రి వేళల్లో వివిధ వాహనాల్లో పురవీధుల్లో విహరిస్తున్న శ్రీస్వామి, అమ్మవార్లను దర్శించి భక్తులు తన్మయత్వం చెందుతున్నారు. ఓం నమః శ్శివాయ, శంభోశంకర నామస్మరణలు మిన్నంటుతున్నాయి. మరోవైపు ఆలయం, పరిసరాలు విద్యుద్దీప కాంతులతో దేదీప్యమానంగా ధగధగలాడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మరింత శోభాయమానంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తులు, తోరణాలు, స్వాగత ఆర్చీలు కాంతులీనుతూ భక్తులను కనువిందు చేస్తున్నాయి.

– శ్రీకాళహస్తి



ఆలయంలో విద్యుత్ దీపాలంకరణలు



కాంతులీనుతున్న రాజ గోపురం



ఊంజలసేవ మండపం





విద్యుత్‌కాంతులతో శ్రీకాళహస్తీశ్వరాలయం, పరిసరాలు

# జగనన్న వెంటే మేమంతా..



మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన భీమునిచెరువు యువకులు

- భీమునిచెరువు యువత స్పష్టం
- స్వగ్రామంలోనే ఆదిమూలానికి ఎదురుదెబ్బ

నారాయణవనం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని భీమునిచెరువు యువకులు స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం మండలంలోని భీమునిచెరువు(ఎమ్మెల్యే ఆదిమూలం స్వగ్రామం) గ్రామ యువకులు తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి నివాసంలో ఆయనను కలిశారు. మంత్రిని శాలువ కప్పి సన్మానించారు. సంక్షేమ ప్రభుత్వాన్ని నడుపుతూ ప్రతి కుటుంబానికి ఫలాలను అందిస్తున్న సీఎం జగనన్న వెంటే తామంతా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి తెలియ జేసి, సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థికి, తిరుపతి ఎంపీ అభ్యర్థికి భీమునిచెరువు పంచాయతీ నుంచే అత్యధిక మెజారిటీ తెప్పించాలని సూచించారు. పుంగనూరు తరువాత తాను దత్తత తీసుకున్న నారాయణవనం మండల పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు, భీమునిచెరువు యువకులు మూర్తి, వెంకటేష్, సుకుమార్, గోవిందస్వామి, ప్రేమ్ కుమార్, సందీప్‌కుమార్, ఉమాపతి, మదన్‌కుమార్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

### నేడు రావణ, మయూర వాహన సేవలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మాఘ బహుళ ఏకాదశి సందర్భంగా బుధవారం రాత్రి(గాంధర్వరాత్రి) రావణబ్రహ్మ వాహనంపై ముక్కంటీశుడు, మయూర వాహనంపై శ్రీజ్ఞానప్రసూనాంబ అమ్మవారు పురవీధుల్లో విహరించనున్నారు. ఉదయం 9గంటలకు పరమశివుడు హంసవాహనంపై, పార్వతీ దేవి యయాళి వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.

### శ్రీకాళహస్తిలో మెగా జాబ్ మేళా రేపు

- 13 కంపెనీల ప్రతినిధులు హాజరు

తిరుపతి అర్బన్: శ్రీకాళహస్తి పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం మంగవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాలకు చెందిన 13 బహుళ జాతీయ కంపెనీల్లో ఉద్యోగాల కల్పనకు ఆయా ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 5వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, డిప్లొమో, బీటెక్ తదితర విద్యార్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు అర్హత సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో రావాలని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లోకనాథం కోరారు.

# బొజ్జలా సిగ్గు..సిగ్గు

- అసత్యాలతో జనంలోకి రాలేవు
- అవివేక రాజకీయాలు మానుకో
- ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ అంజూరు

శ్రీకాళహస్తి: అవగాహన లేమి, పరిణితి లేని 'పప్పు' రాజకీయాలతో గురివింద సామెతకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సరిగ్గా సరిపోతారని, అసత్య ప్రచారాలతో ప్రజల మనస్సులను ఎన్నటికీ గెలవలేరని శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హితవు పలికారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గాలిగోపురం ముందు దేవాంగుల మండపం నిర్మాణం జరిగిన నేపథ్యంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న గాంధీ విగ్రహాన్ని పక్కన ఏర్పాటు చేసేందుకు ఆలయ పాలక మండలి తీర్మానంలో ఆమోదించి నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపినట్లు వివరించారు. కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాక అందరి అనుమతి, అందరి సమక్షంలో విగ్రహాన్ని వేరొక చోటికి తరలించి భద్రపరిచామన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాక, గాంధీవిగ్రహాన్ని గాలిగోపురం సమీపంలో సముచిత స్థానంలో ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. సమాచారం తెలుసుకోకుండా సుధీర్‌రెడ్డి ప్రజలను తప్పుదారి పట్టించేందు కోసం గాంధీ విగ్రహాన్ని తోసేశారంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే నాలుగు మాడ వీధుల్లో టీడీపీ నేతలు అనేక రాజకీయ ప్లెక్సీలు ఏర్పాటు చేశారని, ఎవ్వరికీ తెలియకుండా వాటిని తొలగించి, దెయ్యాలు వేదాలు వల్లించినట్లు రాజకీయ ప్లెక్సీల గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. 30 ఏళ్ల చరిత్రను తిరగరాస్తూ నాలుగు మాడ వీధుల్లో అండర్ ఎలక్ట్రికల్ లైన్ ఏర్పాటు చేస్తే, దాని కోసం ఏర్పాటు చేసిన బాక్సులపైన సుధీర్‌రెడ్డి ఫొటో ఉన్న స్టిక్కర్లను అతికించారని అన్నారు. ప్రమాదవశాత్తూ అతికించిన వారికి ఏమైనా జరిగి ఉంటే సుధీర్‌రెడ్డి బాధ్యత వహించి ఉండేవారా..? అని ప్రశ్నించారు. ఆలయం, పరిసరాల్లో నాలుగు మాడ వీధుల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కల కుండీలను ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా దానిపై త్రిశూలం, ఓం గుర్తులను ముద్రిస్తే, దానిపై టీడీపీ కరపత్రాలను అతికించి అపవిత్రం చేసి ఉత్తముడిలా ప్రసంగాలు చేయడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.



కుండీలపై బొజ్జల కరపత్రాలు



విద్యుత్ బాక్సులపై సుధీర్‌రెడ్డి ఫొటో ఉన్న స్టిక్కర్లు



మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం రాత్రి చప్పరాలపై శ్రీస్వామి, అమ్మవార్లు ఆలయంలో విహరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తులు శివనామస్మరణ నడుమ ఆలయ ప్రాకారంలో ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. –శ్రీకాళహస్తి

# అధికార నందిపై నీలకంఠుడు



అధికార నంది వాహనంపై స్వామి, అమ్మవార్లు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి శ్రీసర్వమంగళా సమేత శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మంగళవారం అధికార నంది వాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీస్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీవాల్మీకీశ్వరస్వామి, మరకదాంబిక అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి పట్టు పీతాంబరాలు, స్వర్ణాభరణాలు, పరిమళభరిత పుష్ప మాలికలతో సుందరంగా అలంకరించి నక్షత్ర హారతి, కుంభ హారతి, మహా హారతి సమర్పించి నంది వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం మంగళవాయిద్యాలు, బాణ సంచా పేలుళ్ల సందడి నడుమ తిరువీధి ఉత్సవం నయనానందకరంగా సాగింది. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి, కార్య నిర్వహణాధికారి కె.రామచంద్ర, ట్రస్టు బోర్డు సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# తొండమాన్‌పురంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

శ్రీకాళహస్తి : మండలంలో తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధంగా తొండమాన్‌పురంలోని పురాతన శ్రీప్రసన్న వేంకటేశ్వరాలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవ నిర్వహించారు. తొలుత డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు కలశ జలాలను ఆలయంలోకి తీసుకొచ్చారు. అనంతరం ఆలయాన్ని శుద్ధి చేసే క్రతువును పూర్తి చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ రెడ్డి, అధికారులు ఆనంద్, సదాశివయ్య, అర్చకులు రమణాచార్యులు, గోపి, కృష్ణ, బాబు, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కలశ జలాలను తీసుకొస్తున్న అధికారులు, అర్చకులు

# సంగీత ఝరి.. భక్తి విభావరి



రేణుకమ్మ బృందం సంగీత కచేరి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరస్వామివారి మహాశివరాత్రి బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కళావేదిక ధూర్జటి కళాప్రాంగణంలో కాకినాడకు చెందిన గౌతమ్ ఆర్కెస్ట్రా ఘంటసాల భక్తి విభావరి ఆహుతులను సంగీత సాగరంలో ఓలలాడించింది. పీవీ రమణ ఆలపించిన శివ భక్తి గీతాలు రంజింపజేశాయి. వాసవి మహిళా మండలి, రేణుకమ్మ బృందం భక్తి సంగీత విభావరి అలరించింది. శ్రీవాగ్దేవి కళాపీఠం, విశాఖపట్నానికి చెందిన బ్రహ్మశ్రీ వెంపరాల లక్ష్మీ శ్రీనివాస మూర్తి వారి ప్రవచనం శ్రోతలను భక్తి తన్మయత్వంతో మురిపించింది. కళాకారులను దుశ్శాలువ, ప్రశంసా పత్రాలతో ఆలయాధికారులు సత్కరించారు.





ఘంటసాల భక్తి విభావరిలో గీతాలు ఆలపిస్తున్న పీవీ రమణ, ప్రవచనం చేస్తున్న బ్రహ్మశ్రీ లక్ష్మీ శ్రీనివాస మూర్తి

# నేడు సత్యవేడులో ఎంపీ పర్యటన

సత్యవేడు: మండలంలో బుధవారం తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ బుధవారం పర్యటించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇరుగుళంలో మధ్యాహ్నం 3గంటలకు సచివాలయ నూతన భవనం, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ భవనాన్ని ప్రారంభిస్తారు. 4గంటలకు కమ్యూనిటీ శానిటేషన్ కాంప్లెక్స్, ఇరుగుళంలో 11 లక్షలతో సిమెంటు రోడ్డు, మల్లవారిపాళెంలో రూ.48 లక్షలతో సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ చేస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు హాజరుకావాలని కోరారు.



ఇరుగుళంలో బుధవారం ఎంపీ ప్రారంభించనున్న సచివాలయ భవనం

# త్వరితగతిన భవన నిర్మాణాలు

సత్యవేడు: ప్రభుత్వ ప్రాధాన్యత పనులైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు, గడప గడపలో మంజూరైన సిమెంటు రోడ్ల పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను పంచాయతీ రాజ్ ఎస్ఈ శంకర్ నారాయణ ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏడు మండలాల సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో అభివృద్ధి పనులపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఎస్సీ మాట్లాడుతూ నియోజకవర్గానికి 78 సచివాలయాలు 78, 36 హెల్త్‌క్లీనిక్‌లు, 63 వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాలు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో 44 సచివాలయాలు, 22 హెల్త్ క్లీనిక్‌లు, 42 రైతు భరోసా కేంద్రాల భవనాలు పూర్తి అయ్యాయన్నారు. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేయాలని తెలిపారు. పనిచేసిన కాంట్రాక్టర్లుకు పెండింగ్ లేకుండా బిల్లులు అందజేయాలన్నారు. పనుల్లో క్వాలిటీ కంట్రోల్, సోషల్ ఆడిట్‌పై ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచనలు అందించారు. ఈఈ సత్యనారాయణ, ఎంపీడీఓ ఎన్. చంద్రశేఖర్, డీఈ మధుసూదన్, ఏఈలు దేవిప్రసాద్(సత్యవేడు),ఎస్ చంద్రశేఖర్ (నారాయణవనం) మదన్(కేవీబీపురం) బాలాజీ( నాగలాపురం) నాగరాజు(వరదయ్యపాళం) పాల్గొన్నారు.



సూచనలిస్తున్న ఎస్ఈ శంకర్ నారాయణ